నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం | జనవరి 21, 2024 | www.navatelangana.com

జవహార్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

- 866 మంది గైర్హాజరు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రానున్న విద్యా సంవత్సరంలో జవహార్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాల కోసం శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 6వ తరగతిలో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జిల్లా కేంద్రంలో 13 పరీక్ష కేంద్రాలలో ఉదయం 11 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 01 గంట 30 నిమిషాల వరకు పరీక్ష నిర్వహించారు. 2563 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 1697 మంది హాజరయ్యారు. 866 మంది గైర్హాజరయ్యారైనట్టు జవహర్ నవోదయ ప్రిన్సిపల్ తెలిపారు.

147 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో 200 బస్తాల్లో గల, 147 క్వింటాళ్ల పిడిఎఫ్ నూకలు (బియ్యాన్ని) శనివారం పట్టుకున్నట్లు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా కేంద్రంలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు సిరిసిల్ల రోడ్‌లో గల ఎల్లమ్మ గుడి ఎదురుగా గల వెంకటరమణ అనే వ్యాపారి డీసీఎం వాహనంలో 128 క్వింటాళ్ల బియ్యాన్ని లోడ్ చేస్తుండగా పట్టుకున్నామన్నారు. అదే సిరిసిల్ల రోడ్ గల దుద్దెల రాజేందర్ వద్ద 19 క్వింటాళ్ల 20 కిలోల బియ్యం స్వాధీనం చేసుకొని పట్టణ పోలీస్ స్టేషన్లో ఎస్‌హెచ్‌వోకు అప్పగించినట్లు తెలిపారు. ఈ వ్యాపారులు ముందస్తుగానే పిడిఎఫ్ బియ్యాన్ని గ్రామాలలో సేకరించే వారికి ఆ బియ్యాన్ని నూకలుగా మార్చి తేవాలని చెప్తారని అట్టి నూకలను కోళ్ల ఫారాలకు విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఊరికో బెల్ట్‌షాప్

- పలు గ్రామాల్లో రెండుకు మించి..
- అందుబాటులో ఉండటంతో పెరుగుతున్న మద్యం బానిసలు
- అధికారిక లెక్కల్లో తూతూ మంత్రంగా తనిఖీలు, కేసులు
- క్షేత్రస్థాయి పరిశీలనలో పలు అంశాలు వెలుగులోకి
- వైన్స్‌ల నుంచి లెక్కకు మించి యథేచ్ఛగా తరలింపు.. తెల్లకాగితమే బిల్లు

నవతెలంగాణ-కామారెడ్డి/మద్నూర్

ఊరికో బెల్ట్‌షాప్ ఉన్న విషయం బహిరంగ రహస్యమే. పలు గ్రామాల్లో అయితే ఏకంగా రెండుకు మించి బెల్ట్‌షాప్‌లు కొనసాగతున్నాయి. అయినా వాటిని కట్టడికి చర్యలు శూన్యం. కానీ అధికారిక లెక్కల్లో మాత్రం తనిఖీలు చేపట్టి కేసుల నమోదు చేస్తున్నట్టు చూపెడుతుండటం గమనార్హం. కొనసాగుతున్న బెల్టుషాపులకు, అధికారులు చూపెడుతున్న లెక్కలకు ఎక్కడా పొంతన లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నవతెలంగాణ క్షేత్రస్థాయిలో పరిశీలించగా.. పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళ్తే..

గ్రామంలో బెల్ట్ షాపులు లేకపోతే బీద ప్రజల కుటుంబాలు బాగుపడతాయని ప్రజలు ఆశిస్తున్నారు. ప్రతిరోజు కష్టం చేస్తే గాని పూట గడవని కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాలు కేవలం కూలి పైనే ఆధారపడి జీవిస్తుంటాయి. అలాంటి కుటుంబాల్లో సైతం బెల్ట్‌షాపులు చిచ్చుపెడుతున్నాయి. మద్యం అందుబాటులో ఉండేసరికి.. పొద్దంతా కాయకష్టం చేసి సంపాదించిన డబ్బులను మద్యం కోసం వెచ్చిస్తున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారు. ఊరి నుంచి బెల్ట్‌షాపులను తొలగించాలని డిమాండ్ చేస్తున్నా.. పాలకులు, అధికారులు పెడచెవిన పెడుతున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. అధికారయంత్రాంగం తీసుకునే చర్యలు శూన్యం. పైపెచ్చు కట్టడికి చర్యలు తీసుకుంటు న్నామంటూ.. కొన్ని లెక్కలు చూపెడుతుండటం గమనార్హం.

బీబీపేట్ మండలం మాందాపూర్ గ్రామంలో ఒక యువకుడు గతం లో మద్యా నికి బానిసై ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. ఆత్మహత్య కేసుల్లో ఎక్కువ శాతం మద్యానికి బానిసై.. చేతిలో డబ్బులు లేక చేసుకుంటు న్నట్టు పోలీసులే పేర్కొంటుడటం గమనార్హం. అయినా కానీ చర్యలు శూన్యం.



మద్యం కొనుగోలుపై చిట్టీపై బిల్లు

మద్నూర్‌లో క్షేత్ర పరిశీలన చేయగా.. వైన్స్‌ల నుంచి బెల్ట్ షాపులకు దర్జాగా మద్యం తరలిస్తున్న వైనం వెలుగుజూసింది. బెల్ట్ దుకాణాలకు వైన్స్‌ల నుంచి మద్యం విక్రయించొద్దని నిబంధనలు ఉన్నా.. అడిగివారు లేక.. అధికారులు పట్టించుకోక.. వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుంది. నిబంధనాల ప్రకారం ఒక వ్యక్తికి మద్యం అమ్మడానికి బీరు బాటిల్లు అయితే ఒక కాటన్, క్వార్టర్లు అయితే ఆరు బాటిల్లకు మించి ఇవ్వకూడదని ఉన్నా.. యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. మద్యం అమ్మాలంటే ప్రతి వ్యక్తికి వైన్స్ షాపు పేరున ప్రింటెడ్ బిల్లు ఇవ్వాలి. అలాంటిదేమీ ఇవ్వకుండా ఇష్టం వచ్చిన రీతిలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఒక్కొక్క వ్యక్తికి వేలాది రూపాయల మద్యం అమ్ముతున్నప్పటికీ వైన్స్ షాపు ఒరిజినల్ బిల్లులు ఇవ్వకుండా చిత్తు కాగితాల పైన బిల్లులు ఇస్తున్నారు. ఈ అంశాలు నవతెలంగాణ పరిశీలనలో వెలుగుజూశాయి. బెల్టు షాపు యజమానులు వైన్స్ షాపుల నుండి మద్యాన్ని కొనుగోలు చేసే వాటికి ఒరిజినల్ బిల్లులు ఇవ్వకుండా చిత్తు కాగితాల పైన అందజేసే బిల్లులను కూడా నవతెలంగాణ గుర్తించింది. మద్నూర్ ఉమ్మడి మండలంలోని మద్నూర్ డోంగ్లి మండలాల పరిధిలో మొత్తం 34 పంచాయితీల పరిధిలో 38 గ్రామాలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు కొనసాగుతుంది. ప్రతిరోజు ఒక్కొక్క గ్రామానికి వేలాది రూపాయల మద్యం బెల్టు షాపులకు తరలిపోతుంది.



మద్నూర్‌లో వైన్స్ నుంచి బెల్ట్‌షాప్‌నకు మద్యం తరలింపు

ఇలాంటి ఉల్లంఘన మద్యం అమ్మకాల గురించి ఎక్సైజ్ శాఖ బిచ్కుంద సీఐ సత్యనారాయణ నవతెలంగాణ విలేకరి ఫోన్ ద్వారా వివరణ కోరగా సిఐ సత్యనారాయణ తెలుపుతూ వైన్స్ షాపుల్లో లీగల్‌గా బెల్ట్ షాపులకు మద్యం అమ్మకాలు జరపాలని ఎక్కడ ఆదేశాలు లేవని ఇల్లీగల్ గా బెల్ట్ షాపులకు మద్యం అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. వైన్స్ మద్యం అమ్మకాల నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి మద్యం ఏ విధంగా అమ్మాలి అని వివరణ కోరగా ఒక వ్యక్తి బీర్లు కొనుగోలు చేస్తే ఒక కాటన్ వరకు ఇవ్వవచ్చని మద్యం బాటిళ్లు కొనుగోలు చేస్తే ఆరు బాటిళ్లకు మించి అమ్మకూడదని నిబంధనలు ఉన్నట్లు తెలిపారు. ఒక్కొక్క వ్యక్తి కాటన్‌ల కొద్దీ మద్యం తీసుకు వెళ్తున్నారు కదా అని ప్రశ్నించగా అలాంటి అమ్మకాలపై కేసులు నమోదు చేస్తామని సీఐ వివరణ ఇచ్చారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమ

మత రాజకీయాలను తిప్పికొట్టాలి

- ఫిబ్రవరి-16 అఖిల భారత సమ్మెను జయప్రదం చేయండి
- జిల్లా సదస్సులో నాయకుల పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక , రైతు , ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి-16 అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం లో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ రమ, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు హాజరై మాట్లాడారు.

కేంద్రం అవలంబిస్తు, కార్పొరేట్, మతోన్మాద , నయా ఉదారవాద విధానాల వలన ప్రజలు, కార్మిక వర్గం రైతాంగం, పేద ప్రజల నుండి వచ్చే వ్యతిరేకతను గుర్తించి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ మత రాజకీయాలకు తెరలేపుతూ అయోధ్య రామ మందిరాన్ని ముందుకు తీసుకువచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ , విద్యుత్ సంస్కరణ బిల్లు, కార్మిక చట్టాల మార్పు, నేషనల్ మానిటైజేషన్ , జీఎస్టీ , ఇలా అనేక రకాల చట్టాలు తీసుకొచ్చి బడుగు బలహీన వర్గాల ప్రజల ఆస్తులను దోచుకొని పెట్టుబడుదారులు, కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ వారికి లాభం చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం విధానాలు ఉన్నాయని విమర్శించారు. కాబట్టి ఈ బీజేపీ చేస్తున్న మత రాజకీయాలను తిప్పి కొట్టడంలో భాగంగా దేశంలోని కార్మిక వర్గం , రైతాంగం , ప్రజలందరినీ చైతన్యం చేయడం కోసం దేశంలోని అన్ని జాతీయ కార్మిక సంఘాలు , (రైతు సంఘాల ఐక్యవేదిక) సంయుక్త కిసాన్ మోర్చా , అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం , అఖిల భారత కిసాన్ సభలు సంయుక్తంగా ఫిబ్రవరి 16 న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్ , పారిశ్రామిక బంద్ కు పిలుపునిచ్చినట్టు తెలిపారు. కావున జిల్లాల్లో ఉన్న స్కీమ్ వర్కర్లు, ప్రజలు, రైతులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు,మేధావులు అందరూ జరిగే అటువంటి గ్రామీణ బందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధరప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోవర్దన్, ఐద్వా జిల్లాకార్యదర్శి సుజాత, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరేశ్, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సాయిలు, సాగర్, రేణుక ,సుకన్య, కష్ట భాస్కర్ లక్ష్మి మౌనిక పసియోద్దీన్, ఆయిలు రాజేష్ కటారి రాములు, నరసయ్య శైలజ, మున్సిపల్ నాయకుడు, మోహన్, అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు జగదాంబ, భూమయ్య పాల్గొన్నారు.



హాజరైన వివిధ రంగాల కార్మికులు

డబ్బులు, గిఫ్టులు ఊరికే ఎవరూ ఇవ్వరు

- సైబర్ నేరాల కట్టడిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రసాద్

నవతెలంగాణ-కామారెడ్డి

దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వి ఆర్ కె డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాల కట్టడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ సెల్ ఇంచార్జ్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్, కళాబృందం సభ్యులు సైబర్ నేరాల పట్ల భాదితులు టోల్ ఫ్రీ నెంబర్ 1930 అనే నెంబర్ కి ఫిర్యాదులు చేసుకోవచ్చు అన్నారు సైబర్ నేరగాళ్లు చేసే మోసపూరిత ఫోన్ కాల్స్, సందేహాలను నమ్మవద్దని, లోన్ అప్లికేషన్ ఎవరు కూడా డౌన్‌లోడ్ చేసుకోవద్దని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరు కూడా డబ్బులు గానీ, బహుమతులుగాని, ఉద్యోగాలు గాని ఊరికే ఇవ్వరు అనే విషయాన్ని అర్థం చేసుకొని జిల్లా ప్రజలు ఇలాంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్త వహించాలని కోరారు. కార్యక్రమానికి సైబర్ క్రైమ్ కళాబృందం సభ్యులు, కళాశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షేక్‌మున్నాను చైర్మన్‌గా కొనసాగించాలి

- ముస్లిం, మర్కజ్ కమిటీ సభ్యుల డిమాండ్



రాస్తారోకోలో నినాదాలు చేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న షేక్ మున్నాను చైర్మన్‌గా కొనసాగించాలని ముస్లిం, మర్కజ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని కెనాల్ బ్రిడ్జి వద్ద శనివారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైర్మన్ లేకపోవడంతో అభివద్ధి కుంటపడిందని, పట్టణంతో పాటు ఇందులో విలీనమైన మామిడిపల్లి, పెర్కిట్ లలో సైతం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని సంబంధిత అధికారులు ప్రభుత్వం స్పందించాలని కోరారు.

చైర్మన్ ఎన్నిక చేపట్టాలని కౌన్సిలర్‌ల డిమాండ్

అవిశ్వాస తీర్మానంతో చైర్మన్ పదవి ఖాళీ అయిందని, చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ ఇచ్చి చేపట్టాలని కౌన్సిలర్‌లు సైతం డిమాండ్ చేస్తున్నారు. ఇది వరకే ఆర్డీవోతో పాటు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. చైర్మన్ పదవి ఖాళీ అయి 15 రోజులవుతుందని, వెంటనే ఎన్నికల చేపట్టాలని కోరుతున్నారు.

ఎటువంటి ఆదేశాలు రాలేవు

వినోద్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి ,ఆర్మూర్.

మున్సిపల్ చైర్ పర్సన్ పదవిపై జిల్లా కలెక్టర్ నుండి ఎటువంటి ఆదేశాలు రాలేవు. ఉన్నతాధికారుల సూచనల సలహాల మేరకు సమాచారం వచ్చిన వెంటనే తెలియజేస్తాం.

చట్టాలపై ఇప్పటికీ అవగాహన లేదు

- అందుకే గ్రామాల్లో న్యాయ చైతన్య సదస్సులు
- రాజ్యాంగం హక్కులతో పాటు బాధ్యతలూ ఇచ్చింది
- బహిష్కరణ పేరుతో వీడీసీలు వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

నవతెలంగాణ-ధర్పల్లి

మనకు రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్నా.. గ్రామాల్లో ఇప్పటికీ చట్టాలపై అవగాహన లేదనిజిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. రాజ్యాంగం మనకు హక్కులతో పాటు బాధ్యతలు సైతం ఇచ్చిందని తెలిపారు. అందులో చట్టాలు తెలిపింది, కానీ అవి మనమెంత వరకు చట్టాలను తెలుసుకున్నాము, వేటిపై ఎలాంటి చట్టాలు ఉపయోగిస్తారు అనే దానిపై ఇప్పటికీ గ్రామ స్థాయిలో కొంత మందికి తెలుసుకోలేక పోతున్నారని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ధర్పల్లి మండలంలోని దుబ్బాక గ్రామంలో శనివారం న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల ముఖ్య అతిధిగా పాల్గొని ప్రజలను చట్టాలపై అవగాహన కల్పించారు. 'పల్లెటూర్లు దేశానికి పట్టు కొమ్మలు. అందుకే పండగలకు పల్లెటూర్లకు వెళ్లాలనే ఆత్రుత పట్టణ వాసులకు కలుగుతుంది. పూర్వీకులనుండి వచ్చిన మన సంప్రదాయాలను కొనసాగిస్తూ గ్రామస్తులం తా బేదాభిప్రాయాలు, కల్మషాలు లేకుండా ఆప్యాయ తతో ఇక్కడ ఉండే వాతావరణం ఇప్పటికి గౌరవించదగినది. కానీ అక్కడక్కడ చిన్న చిన్న పొరపాట్లతో ప్రజలు న్యాయస్థానకు ఆశ్రయిస్తుండ టంతో ఇలాంటి కేసులు కోర్టుల్లో పేరుకుపోతు న్నాయి. అసలు కేసులు పెరగటాని




మాట్లాడుతున్న జిల్లా జడ్జీ కుంచాల సునీత

కారణం ఏంటని, ఇటు ప్రభుత్వాలు, అటు న్యాయస్థానాలు గమనించి వీటి పరిష్కార మార్గాల కోసం అన్వేషించగా.. గ్రామస్థాయిలో న్యాయ చైతన్య సదస్సులు ఏర్పాటు చెయ్యాలనే ఉద్దేశంతో గ్రామాల్లో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు ,జిల్లా కలెక్టర్,జిల్లా పోలిసు ఉన్నత అధికారులతో ఏర్పాటు చేసినట్టు' తెలిపారు.

వీడీసీలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

'గ్రామాల్లో అందరు కలిసి మెలసి ఉండాలి. గ్రామస్తులకు ఎవరికైనా ఎలాంటి సమస్య వస్తే అందరు కలిసికట్టుగా పరిష్కరించుకోవడం మంచి పరిణామం. అలాకాకుండా ఒక ఇంటినో, లేదా ఏ కులాన్ని బహిష్కరించడం లాంటివి చేయకూడదు. అవసరం అనుకుంటే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ఉంది. పోలీసులు ఉన్నారు. రెవెన్యూ యంత్రాంగం ఉంది. కోర్టులు ఉన్నాయి. వాటిని ఆశ్రయించి న్యాయం పొందేవిధంగా చూసుకోవాలి తప్ప వాటిని పెద్దవిగా చేసి కేసులవరకు వెళ్లకుండా జాగ్రత పడాలి. దీని ద్వారా ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయి. కేసులు ఉండవు. ఇటు అధికారులకు తిప్పలు ఉండవు. కొన్ని గ్రామాల్లో విడిసిలు బహిష్కరణ పేరుతో తోటి గ్రామస్తులకు ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని ఇబ్బదులు ఇతరులకు కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయి. గ్రామాల్లో విడిసిలు చేస్తున్న అనేక పనులు, ఆయాగ్రామాల అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందించా ల్సినదిగా ఉన్నప్పటికీ , మరికొన్ని విడిసిలు కుటుంబాల బహిష్కరణల పేరుతో, అలాగే చిన్న చిన్న తప్పులవల్ల కేసుల్లో ఇరుక్కునే పరిస్థితులు తీసుకువస్తు న్నారు. అన్నదమ్ముల్లా ఉండాల్సిన పల్లెల్లో ఇలాంటి జరగ కూడదనే ఉద్దేశంతోనే ఇలాంటి కార్యక్రమాలు న్యాయస్థానం ద్వారా ప్రతి నెల ఒక్కొక్క గ్రామంలో చైతన్య సదస్సు కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్టు' వెల్లడించారు.

అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ గ్రామస్థులు అందరు కలిసి కట్టుగా ఉండి ఇతర గ్రామాలకు ఆదర్శనంగా ఉండాలని అన్నారు, చట్టాలను చేతుల్లోకి తీసుకొని తప్పు చేసి జైళ్ల పాలు కాకూడదని తెలిపారు. డ్రగ్స్, కొక్కయిన్, గంజాయి రహిత గ్రామాలుగా తీర్చి దిద్దుకోవాలని సూచిం చారు. ఇలాంటి వాటికి 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో సీపీ కల్మేశ్వర్, ఆర్డీఓ రవి, తహసీల్దార్ మాలతీ, ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి, పిడిఓ లక్ష్మణ్, ఏసిపి జైరాం, సిఐ సైదా, ఎస్ఐ వంశీ కృష్ణ రెడ్డి, గ్రామ సర్పంచ్ వెంకటేష్, ఉప సర్పంచ్ పి.ప్రకాశ్‌గౌడ్, ఎంపిటిసి పెండ గంగాధర్, వార్డు సభ్యులు, మండలంలోని అన్ని గ్రామాల విడిసి సభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



హాజరైన గ్రామస్తులు

తపాలశాఖతో ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

- నిజామాబాద్ జిల్లా ఎస్ఎస్‌పిఓఎస్‌కే జనార్దన్ రెడ్డి

నవతెలంగాణ-మద్నూర్

తపాల శాఖ ద్వారా భారత ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తపాల శాఖ నిజామాబాద్ జిల్లా ఎస్-ఎస్‌పిఓ ఎస్‌కే జనార్దన్ రెడ్డి కోరారు. మద్నూర్ మండల కేంద్రంలోని తపాల శాఖ కార్యాలయంలో మద్నూర్, బిచ్కుంద, జుక్కల్ శాఖలకు చెందిన తపాల సిబ్బందికి భారత ప్రభుత్వం కల్పించే పథకాల అవగాహన కల్పించారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలకు చెందిన ప్రజలకు తపాల శాఖ అమలు చేస్తున్న పొదుపు పథకాలు సీనియర్ సిటిజన్ స్కీం సుకన్య సమృద్ధి యోజన ప్రధానమంత్రి జీవనజ్యోతి సురక్ష బీమా యోజన అటల్ పెన్షన్ స్కీమ్ ఇలాంటి వాటితో పాటు తపాల శాఖ మరికొన్ని రకాల ప్రయోజనాల పథకాలు అమలు చేస్తుందని ప్రజలు తపాలా శాఖ ద్వారా అనేక రకాల స్కీములు భారత ప్రభుత్వం అందజేస్తుందని ఏడాదికి 520 రూపాయలు బీమా ప్రీమియం కట్టుకుంటే 10 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని ఇలాంటి ముఖ్యమైన పథకాలు తపాల శాఖ ద్వారా ప్రజలు సద్వినియోగం పరుచుకొని లబ్ది పొందాలని కోరారు. మద్నూర్ మండలంలోని లచ్చన్ గ్రామానికి చెందిన జి దేవిదాస్ అనే వ్యక్తికి ప్రమాద బీమా పథకం కింద ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం 62 వేల రూపాయల



చెక్కు అందజేస్తున్న అధికారులు

చెక్కును ఆయన లబ్ధిదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ డివిజన్ ఇన్స్‌పెక్టర్ జి వేణు, కామారెడ్డి బ్రాంచ్ మేనేజర్ పవన్ రెడ్డి, ఎస్పీఎంఎస్ గంగాధర్, గోపాల్ షకీల్, సూర్యకాంత్ ఎంఓ బిపిఎంఎస్ ఏబిపిఎస్ తపాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొడుకు అనాథవుతుండు.. అయినా తప్పట్లే

- బాపు.. మళ్లా నీ కడుపులనే పుడతనే
- భూమి కబ్జా చేశారని వ్యక్తి ఆత్మహత్య
- మాజీ విప్, సర్పంచ్ మరికొందరు కారణమంటూ వాట్సప్‌లో మరణ వాంగ్మూలం



ఘటనా స్థలంలో పంచనామా చేపడుతున్న పోలీసులు

నవతెలంగాణ-దోమకొండ

'అమ్మ, నాన్న నన్ను క్షమించడి. మా అమ్మకు మొన్ననే కంటి ఆపరేషన్ జరిగింది. నా కూతురు రేపు నవోదయ ఎగ్జాం రాయాలి. నా కొడుకు అనాథవుతుండు. తలచుకుంటేనే ఎలానో వుంది. కానీ నాకు తప్పట్లేదు. బాపు మళ్లీ నీ కడుపులనే పుడతనే' అంటూ ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామ సర్పంచ్‌తో పాటు మాజీ విప్, మరోకొందరు తన చావుకు కారణమంటూ వాట్సప్‌లో మరణవాగ్మూళం రాసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన దోమకొండ మండలం అంబారిపేట్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ మురళి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుట్ట బాల్ చంద్రం (38) హెూటల్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. తన చావుకు గల కారణాన్ని రాసి వాట్సప్ గ్రూప్‌లలో షేర్ చేశాడు. అతడు రాసిన వివరాల ప్రకారం.. 'నా చావుకు పూర్తి బాధ్యుడు అంబారీపేట గ్రామ సర్పంచ్ మహమ్మద్ సలీం. రెండవ బాధ్యుడు పుట్ట శ్రీనివాస్, పుట్ట బాల్ నర్సు. నాకు కొత్త గ్రామ పంచాయతీ ముందు ఒక ప్లాట్ వుంది. అది బీఆర్ఎస్ సర్పంచ్ సలీం కబ్జా చేశాడు. నాకున్న 420 గజాల జాగ జీపీ భవనం కోసం పోయింది. అది పోయినా పక్కనే మైలి రవి ఇంటి ముందు బండలు వున్నాయి. అక్కడ ఇవ్వు అన్నా సర్పంచ్ పట్టించుకోలేదు. మాజీ విప్ గంప గోవర్ధన్‌కి పలుమార్లు చెప్పినా పట్టించుకో లేదు. కొన్ని సంవత్సరాల క్రితం ప్లాట్‌కు వేసుకున్న కంచెను రాత్రికి రాత్రి ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో సలీం పర్యవేక్షణ లో గంప గోవర్ధన్ కనుసన్నల్లో నా ప్లాట్ తీసివేశారు. కాబట్టి నా చావుకు మొదటి కారణం మా ఊరి సర్పంచే' అని రాసుకొచ్చారు.

అదే విధంగా రెండో కారణం అంటూ.. 'నాకు కొత్తకుంట వెనకాల, ఫరిద్‌పేట్ లింక్ రోడ్ చర్చ్‌కి ఎదురుగా ఉన్న స్థలం మా నాన్న స్వంతం. కష్టపడి మా నాన్న సంపాదించుకుంది. అందులో మా పాలొల్లకు సంబంధం లేదు. అయిన కూడా మమ్మల్ని సాగు చేసుకోకుండా పుట్ట శ్రీనివాస్, పుట్ట బాల్ నర్సు అడ్డుకుంటున్నారు. ఈ ఇద్దరు నా చావుకు రెండో కారకులు. గ్రామ పంచాయతీకి వచ్చిన నిధుల వివరాలు, పనులు చేపట్టకపోవడంతో తాను ప్రశ్నిస్తుండటంతో సర్పంచ్ నా మీద కక్షతో నా ప్లాట్‌ను కబ్జా చేసుకున్నాడని' ఆరోపించారు.

సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి స్పందించి రాజకీయ పలుకుబడితో వారు తప్పించుకున్నా.. మీరే తన కుటుంబానికి న్యాయం చేయాండి. ఇదే నా మరణ వాగ్మూలం అంటూ పేర్కొన్నాడు. కాగా మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. ఘటన స్థలాన్ని డియస్పి, సీఐ తిరుపతయ్య పరిశీలించారు. మృతుడికి భార్య పుట్ట సుగుణ, కూతురు, కుమారుడు ఉన్నారు.

తపస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ నూతన క్యాలెండర్‌ను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఘన జ్యోతిరాణి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం విషయంలో తపస్ మడమతిప్పని పోరాటం చేస్తుందని క్యాలెండర్ కూడా దేశ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా బాధ్యులు శ్రీ నారాయణ, అధ్యక్షులు శ్రీ వెంకటరాం యాదవ్, ప్రధాన కార్యదర్శి రామానుజాచారి, మహిళా కార్యదర్శులు కళ్యాణి, సుమలత, మండలబాధ్యులు నవత శ్రీనివాస్, మైత్రి గంగాధర్ మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలో పిఆర్‌టియూ యూనియన్ క్యాలెండర్, డైరీని జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్ శనివారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పిఆర్ టియూ యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పిఆర్‌టియూ యూనియన్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవ్‌తెలంగాణ-వర్ని

రుద్రూర్ మండలం అంబం(ఆర్) గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలో 6వ, 10వ తరగతి వరకు ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు వెల్లడించారని పాఠశాల ప్రిన్సిపాల్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7,8,9,10 తరగతుల్లో ఖాళీలను బట్టి ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు దరఖాస్తు ఫీజు రూ.125, ఓసి విద్యార్థులకు రూ.200 మీ సేవలలో ఆన్‌లైన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. www.telanganas.com. లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అమీర్‌నగర్ గ్రామంలో శనివారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను 8వ, 9వ తరగతి వరకు స్థాయి పెరగడానికి మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కృషి చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రశాంత్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడే గ్రామ బీఆర్ఎస్ నాయకులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కలిసి పాఠశాలను అప్ గ్రేడేషన్ చేయించాలని విన్నవించినట్లు తెలిపారు. వెంటనే మంత్రి హెూదాలో ప్రశాంత్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి పాఠశాలలో 9వ తరగతి నడిపించారన్నారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో ఉత్తర్వులు రావడం జరిగిందని, కానీ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ పార్టీ బాల్కొండ ఇంచార్జ్ సునీల్‌రెడ్డి అమీర్‌నగర్ పాఠశాల అప్ గ్రేడేషన్‌కు ప్రోసిండింగ్ తెప్పించారని అబద్ధపు ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చేతనైతే కొత్తగా ఇంకా మిగిలిన పక్క గ్రామాల పాఠశాలలు కూడా అప్ గ్రేడేషన్ చేయించి గొప్పలు చెప్పుకోండి కానీ, ప్రశాంత్‌రెడ్డి చేసిన పనులను కాంగ్రెస్ పార్టీ చేసింది అని ప్రచారాలు చేయొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుప్పాల గంగాధర్, సొసైటీ వైస్‌చైర్మన్ ఆకుల రాజన్న, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాలవత్ ప్రకాష్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగం గంగారెడ్డి, గ్రామ రైతు కోఆర్డినేటర్ క్యాతం రాజేందర్, బెజ్జరపు సత్యం, జిల్ల రవి, వర్దం రాజేందర్, రమేష్, గంగాధర్, ముత్తెన్న దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

గత నెల ఆర్మూర్ పెర్కిట్ రోడ్డుపై గుర్తు తెలియని ఓ అనాథ అనారోగ్యంతో ఉండగా అక్కడి స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే వైద్యసేవల నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గత 6రోజుల క్రితం మరణించాడని తనకు సంబంధించినవారు ఎవరు రాకపోవడంతో ఆ అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించినట్లు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు సాయిబాబా శనివారం తెలిపారు. ముస్లిం సంప్రదాయ పద్ధతిలో అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్మామ్ హింద్ మువమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థల ప్రతినిధులు డా.సజ్జాద్, మహ్మద్ జాహీర్, హశ్వా, మన్నాన్, షేక్ హుస్సేన్, హలీమ్, ఇందూరు యువత కార్యవర్గం మద్ది గంగాధర్, కాసుల సాయితేజ, ఆర్మూర్ పోలీస్ సిబ్బంది వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి రూ.10లక్షల బీమా



బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసకొత్తూర్ గ్రామ పంచాయతీ సిబ్బందికి రూ.10లక్షల ప్రమాద బీమా చేయించినట్లు ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బందికి ప్రమాద బీమా రూ.520 ప్రీమియం చెల్లించి పోస్టాఫీస్ ద్వారా రూ.10లక్షల పాలసీని చేయించినట్లు వివరించారు. ఈ మేరకు శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో తపాలా శాఖ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది వివరాలను సేకరించి పాలసీలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ద్వారా రూ.10లక్షల ప్రమాద బీమా పాలసీలను అందించడం పట్ల పంచాయతీ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్, పంచాయతీ పాలకవర్గం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

- రూరల్ ఎమ్మెల్యేకు మెప్మా ఆర్పీల వినతి

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్/జక్రాన్‌పల్లి

మెప్మా ఆర్పీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రిసోర్స్ పర్సన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వర్ణలత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఏడు నెలలుగా తమకు వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. శనివారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్వరలత మాట్లాడుతూ.. 2007 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తాము మెప్మా ఆర్పీలుగా ప్రభుత్వాల తరపున, చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2018లో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి 4,000 గౌరవ వేతనం అమలు చేసిందన్నారు. 2023లో మరో మారు 756 జీవో ద్వారా, మరో రెండు వేలు పెంచి ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కానీ ఇప్పటివరకు తమ వేతనాలు పెంపు కాలేదని వాపోయారు. ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడంలో మెప్మా ఆర్పీలు ఎంతో కృషి చేస్తున్నారని, అనేక సర్వేలు చేసి, సమగ్రమైన సమాచారాన్ని ప్రభుత్వానికి అందిస్తున్నామని పేర్కొన్నారు. కావున ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం తమకు సరిపోవటం లేదని, నూతన ప్రభుత్వం స్పందించి మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆర్పీలకు నెలకు రూ.20వేల వేతనం, డ్రెస్‌కోడ్, రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి స్వప్న, ఉపాధ్యక్షురాలు మంజుల, ఆర్పీలు సుజాత, హరిత, రాజమణి, లక్ష్మీ, అమృత తదితరులు పాల్గొన్నారు.

కొలిప్యాక్‌లో ప్రత్యేక పూజలు..

జక్రాన్‌పల్లి: మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో శనివారం శ్రీ ఆనందగిరి లక్ష్మి నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అన్నారు. శనివారం ఆలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తాను ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుకున్న నేపథ్యంలో మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తుందని తెలిపారు. ఆలయంలో కోనేరు పునరుద్ధరణ ఇతర అభివృద్ధికి అలాగే కొలిప్యాక్ నుంచి జాన్కంపేట్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు అర్గుల్ చిన్నరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వినోద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ డిసిఎంఎస్ చైర్మన్ మునిపెల్లి సాయిరెడ్డి, మునుపెల్లి సర్పంచ్ సాయిరెడ్డి, అర్గుల్ సర్పంచ్ గొర్త పద్మ రాజేందర్, కొలిప్యాక్ మాజీ సింగిల్ విండో చైర్మన్ మామిడి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మద్దుల రమేష్, మాజీ సర్పంచ్ భూమన్న, అర్గుల్ ఎంపీటీసీ అనిత, చిన్నరెడ్డి, మాజీ ఎంపీపీ అనంత్‌రెడ్డి, సొప్పరి వినోద్, లక్ష్మణ్, గంగాధర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లి : పూజలు చేసిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో జిల్లా ఉపాధ్యాయుడు



నవతెలంగాణ-కంఠేశ్వర్

హర్యానా ఫరిదాబాద్‌లో డిబిటి-ఆర్‌సిబి క్యాంపస్‌లో భారత దేశ ప్రభుత్వంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ వారు ఈ నెల 17, 20వ తేదీ వరకు నిర్వహించిన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో జిల్లాకు చెందిన దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు చల్లా ముద్దుకృష్ణ పాల్గొన్నారు. ఈయన మన నిజామాబాద్ జిల్లా నుంచి పాల్గొన్న ఏకైక ఉపాధ్యాయుడు కావడం విశేషం. ఈయన నేషనల్ సైన్స్ టీచర్ వర్క్‌షాప్ కేటగిరీలో పాల్గొన్నారు. ప్రపంచంలోని 33 దేశాలకు చెందిన విద్యావేత్తలు ఈ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. మలేసియా, సింగపూర్, కెన్యా, సిరియా దేశాల విద్యావేత్తలు తమ తమ దేశ విద్యా సంస్థలు వ్యవస్థల గురించి వివరించారు. ఈ సందర్భంగా ముద్దుకృష్ణను పాఠశాల సిబ్బంది ప్రధానోపాధ్యాయులు గంగయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అభినందించారు.

ప్రతిభ చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సత్కారం

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో మండలంలోని మంథని ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. గైడ్ టీచర్ మల్లేష్ ఆధ్వర్యంలో లాస్య, అంకిత ఆరోగ్య విభాగంలో కూరగాయలు, పండ్లను సహజ పద్ధతులలో నిలువచేసే పద్ధతిని ప్రదర్శనకు గాను నిజామాబాద్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఆవు పేడ బూడిద, ఆకుల బూడిద, వేర్ల బూడిద, చెక్కపొట్టు బూడిదలను వాడి కూరగాయలు, పండ్లను పదిహేను రోజుల వరకు సహజ పద్ధతులలో తాజాగా నిల్వ చేయవచ్చు. ఇది తక్కువ ఖర్చుతో ఇంట్లోనే అందరూ తయారు చేసుకొని వాడే విధంగా రూపొందించడంతో లాస్య, అంకితను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు లాస్య, అంకితను, వారి గైడ్ టీచర్ మల్లేశ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామల బాయి, ఉపాధ్యాయ బృందం శ్రీనివాస్, కోకిల నాగరాజు, శివదాస్, వేణుగోపాల్, విజయ కుమారి, ఉష ఘనంగా సత్కరించారు.



విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

ఇంటింటికి గోడ స్టిక్కర్లు.. రేపు శోభయాత్ర..



స్టిక్కర్లు అతికిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

ఈ నెల 22న అయోధ్యలో రామ మందిర పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బీజేపీ క్యాంపు కార్యాలయం వద్ద రామ మందిరం సంబంధించిన గోడ స్టిక్కర్లను అతికించి కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్ శనివారం తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పులి యుగంధర్, ఖాందేశ్ ప్రశాంత్, గుగులోత్ తిరుపతినాయక్, ఓబిసి మోర్చా పట్టణ అధ్యక్షులు బాశెట్టి రాజ్‌కుమార్, తంగళ్ళపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

22న శోభయాత్ర..

పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం నుంచి కాశి హనుమాన్ వరకు ఈనెల 22న శోభయాత్ర నిర్వహిస్తున్నట్టు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తమ్మి శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షులు అంబరీష్, మహిళ అధ్యక్షురాలు సుజాత ఒక ప్రకటనలో శనివారం తెలిపారు.

అంగన్వాడీ కార్మికులపై ఎస్మాను ఎత్తివేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆంధ్రప్రదేశ్‌లో అంగన్వాడీ కార్యకర్తలు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నా.. కార్మికులపై జగన్ ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం అప్రజాస్వామికమని ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు జి.భూమన్న అన్నారు. శనివారం ఎన్టీఆర్ చౌరస్తా ధర్నాచౌక్‌లో ఐఎఫ్టీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ కార్మికుల సమ్మెకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించి మద్దతు ప్రకటించారు. అనంతరం ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు భూమన్న మాట్లాడుతూ.. అంగన్వాడీ వర్కర్స్‌కు రూ.11,500 హెల్పర్స్‌కు రూ.7000 వేతనంతో జీవనాన్ని కొనసాగించడం ఎలా సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అంగన్వాడీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. ఆంధ్రాలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్, ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగుతున్న సమ్మెపై ఎస్మాను ప్రయోగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శివకుమార్, జిల్లా కోశాధికారి మురళి, భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎల్లప్ప, సాయిలు, హమాలీ కార్మికుల నాయకులు శంకర్, గంగాధర్, రాజు, గంగారం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

అతిథి అధ్యాపకురాలు ఆకస్మిక మృతి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ నిషిత ఆకస్మికంగా మృతి చెందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.ధనవేని శనివారం తెలిపారు. కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులో అధ్యాపకురాలుగా విధులు నిర్వహిస్తున్న నిషిత కొంతకాలంగా అనారోగ్య సమస్యలకు గురైనట్లు తెలిపారు. కాగా తిరిగి మళ్లీ విధుల్లోకి చేరి బోధన బాధ్యతలను చక్కగా నిర్వర్తించే వారని ఆకస్మికంగా మృతి చెందడం పట్ల తీరని వేదన కలిగించిందని అధ్యాపకులు, విద్యార్థులు సైతం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆమె మృతి పట్ల వైస్ ప్రిన్సిపాల్ శరణ్య, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు సంతాపం ప్రకటించి ఆమె ఆత్మకు శాంతి కలగాలని తెలిపారు.



నిషిత (ఫైల్)

టీడీపీ అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పార్టీ అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలని టీడీపీ నాయకులు అంబిక సత్యనారాయణ అన్నారు. శనివారం టిడిపి అర్బన్ కమిటీ సమావేశాన్ని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో పార్టీ నిర్మాణాన్ని చేయాలని, పార్టీ అనుబంధ విభాగాలను బలోపేతం చేసుకోవాలని అన్నారు. దానిలో భాగంగానే జనవరి 26న పాఠశాలలో, కాలేజీలలో కార్యక్రమాలను నిర్వహించాలని, అర్బన్ కమిటి ఆధ్వర్యంలో జెండా కార్యక్రమాన్ని నిర్వహించాలని' నిర్ణయించామని తెలిపారు. నూతన అర్బన్ కమిటీకి సన్మాన కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించాలని, దీని నిర్వహణకు 9 మందితో సన్మాన కమిటీని నిర్ధారించామని అన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు ఎండీ రఫీక్, మల్లారెడ్డి, పార్టీ కోకన్వీనర్ కొయ్యడ నర్సింలుగౌడ్, లవంగరాజు, నవాదే నర్సయ్య, గంగోని రాజేశ్వర్, లక్ష్మణ్‌యాదవ్, విజయ, సలీం, సర్వరాజ్, జాఫర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గుంటూరు కారం సినిమాలో పేర్లను తొలగించాలి

- ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

గుంటూరు కారం సినిమాలో ప్రతి నాయకుల పాత్రలకు పెట్టిన మార్క్స్, లెనిన్ పేర్లను తొలగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ.. ఈనెల 12న విడుదలైన గుంటూరు కారం అనే సినిమాలో కమ్యూనిజం మూలకర్త, కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కష్టపడి తన జీవితాన్ని సైతం త్యాగం చేసి, భావితరాల భవిష్యత్తును మార్చాలని పెట్టుబడి గ్రంథం రచించిన కారల్‌మార్క్స్, మార్క్సిజంతోనే ప్రపంచ పురోగతి, బానిసత్వ సంకెళ్లను తెంచగలమని నమ్మి దాని ఆచరణలో పెడుతూ రష్యా దేశానికి జార్జ్ చక్రవర్తుల నుంచి విముక్తి కల్పించి విప్లవాన్ని విజయవంతం చేసిన లెనిన్ లాంటి మహనీయుల పేర్లను దర్శకుడు త్రివిక్రమ్ సినిమాలో ఉన్న (ప్రతి నాయకులు)విలన్‌లకు పేర్లుగా పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా గుంటూరు కారం సినిమా నిర్మాత దర్శకుడు స్పందించి సినిమాలో విలన్ పాత్రలకు పెట్టిన పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు వేణు, నాయకులు భీమ్, శంకర్, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన వేల్పూర్ వాసి



మూడవ స్థానంలో మన్విత్‌రెడ్డి

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

ఇటీవల చెన్నైలో జరిగిన ఇండియన్ నేషనల్ మోటార్ సైకిల్ రేసింగ్ ఛాంపియన్‌షిప్‌లో బెంగళూరులో స్థిరపడిన మండల కేంద్రానికి చెందిన క్యాతం రమణారెడ్డి కుమారుడు మన్విత్‌రెడ్డి మూడవ స్థానం సాధించాడు. మొత్తం ఆరు రౌండ్‌లలో జరిగిన ఈ పోటీలలో ఫైనల్‌లో మూడవ స్థానం సాధించి తన సత్తా చాటాడు. ఈ సందర్భంగా మన్విత్‌రెడ్డిని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సైతం అభినందించినట్టు ఆయన శనివారం తెలిపారు.

అక్షరాకృతిలో ఆకట్టుకున్న విద్యార్థులు



అక్షరాకృతిలో విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు జై శ్రీరామ్ అక్షరాకృతిలో ఆకట్టుకున్నారు. ఈనెల 22న అయోధ్యలోని రామ మందిరంలో నిర్వహిస్తున్న ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీష్ అక్షరాలతో చేసిన జై శ్రీరామ్ విన్యాసం అలరించింది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బాలి రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్‌గా పోసానిపేట్ వాసి


కమిషనర్‌గా సునందరెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి
జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్‌గా మండలంలోని పోసానిపేట్ గ్రామానికి చెందిన సునందరెడ్డిని నియమించడం పట్ల మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సునంద రెడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి వరకు విద్యాసం అభ్యసించారని, ఉన్నంత చదువులు చదివి, అంచలంచలుగా ఎదిగి జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడంపై బంధుమిత్రులతోపాటు మండల వాసులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

నిశిత డిగ్రీ కాలేజీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్


ప్లేస్‌మెంట్‌ను డ్రైవ్‌లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్
నిశిత డిగ్రీ కాలేజీలో శనివారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్టు కళాశాల యాజమాన్యం చైర్మన్ నిఖిల్ తెలిపారు. (24)7.ఏఐ, నాంది ఫౌండేషన్, టాస్క్ కంపెనీల నుంచి వచ్చిన ప్రతినిధులు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించగా.. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఎంపికైనట్టు తెలిపారు. ఎంపికైన వారిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కో ఆర్డినేటర్ రాజు, డైరెక్టర్ ఓఎం షేక్, ప్రిన్సిపల్ స్వప్న, వైస్ ప్రిన్సిపల్ రఘువీర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ స్వరాజ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

18 ఏండ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**
- **నేటితో ముగియనున్న ప్రత్యేక డ్రైవ్**

నవతెలంగాణ-కామారెడ్డి/మద్నూర్/ఎల్లారెడ్డి
18 ఏండ్లు నిండిన వారందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేస్ వి పాటిల్ సూచించారు. శనివారం కామారెడ్డి పట్టణంలోని బాలికల పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు తీరును జిల్లా కలెక్టర్ జితేస్ వి పాటిల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 913 పోలింగ్ కేంద్రాలలో శని, ఆదివారం నాడు ప్రత్యేక ఓటరు నమోదు నిర్వహిస్తున్నమని అన్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక క్యాంపు జనవర్ 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఫారం 6 ద్వారా వారి దరఖాస్తును బిఎల్ఓ లకు అందించాలన్నారు. బి. ఎల్ ఓ ల వద్ద ఫారం 6,7,8 అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఓటరుగా జాబితాలో మార్పులు, చేర్పులు,సవరణలు, తొలగింపుకు సంబంధిత ఫారాలలో బి. ఎల్. ఓ లకు సమర్పించాలని కోరారు.


కామారెడ్డి: పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్


మద్నూర్: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్


లింగంపేట్: అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఓటరుగా నమోదు క్యాంపెయిన్‌ను వినియోగించుకోండి

మద్నూర్ : నేడు నిర్వహించనున్న ఓటరుగా నమోదు క్యాంపెయిన్‌ను కొత్త ఓటర్లు వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎండి ముజీబ్ సూచించారు. శనివారం మండల కేంద్రంతో పాటు మెనూర్, కొడచరా, శాఖాపూర్, తదితర గ్రామాలను సందర్శించి క్యాంపెయిన్‌ను పరిశీలించారు. మద్నూర్ మండలంలోని ప్రతి గ్రామంలో గల ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద సిద్ధంగా ఉండే బిఎల్వోలకు ఓటర్ నమోదు కోసం దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించే కొత్త ఓటర్ నమోదు కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్క యువతీ యువకులు ఫామ్ సిక్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అలాగే ఓటర్ ఐడి కార్డులు తప్పులు ఉన్న వారు ఫామ్ 8 ద్వారా దరఖాస్తులు చేసుకొని ఓటర్ ఐడి కార్డులలో తప్పులు సరిచేసుకునే అవకాశాలు ఉన్నాయని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ శంకర్, జూనియర్ అసిస్టెంట్ విజయ్, చంద్రశేఖర్, బాలరాజు రవికుమార్ మద్నూర్ జిపి సెక్రెటరీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబీకులకు ఒకే చోట ఓటుహక్కు : అడిషనల్ కలెక్టర్

లింగంపేట్ : శాసనసభ ఎన్నికల అనంతరం చనిపోయిన ఓటర్ల పేర్లను తొలగించాలని కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ బూత్ లెవల్ అధికారులకు సూచించారు. అదే విధంగా ఒక కుటుంబం వారికి ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ఎల్లారెడ్డి లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసి ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల అనంతరం చనిపోయిన వారిని గుర్తించి వారి పేర్లను ఓటర్ జాబితా నుండి తొలగించాలని బి ఎల్ ఓ లకు సూచించారు. అలాగే వేర్వేరు ప్రాంతాల్లో ఓటు కలిగి ఉన్న వారిని గుర్తించాలన్నారు. వారి అభీష్టం మేరకు ఒక ప్రాంతంలో ఓటు హక్కు కల్పించి ఒక ప్రాంతంలో ఓటర్ జాబితా నుండి తొలగించాలని సూచించారు. ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సాయంత్రం ఐదు గంటల వరకు కచ్చితంగా బిఎల్వోలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్ డి ఓ ప్రభాకర్ మున్సిపల్ కమిషనర్ జీవన్ లింగంపేట్ తహసిల్దార్ సుధాకర్ బి ఎల్ వోలు శ్రావణ్ కుమార్ యాసుబ్ సౌమ్య తదితరులు ఉన్నారు.

సదాశివనగర్ : సదాశివనగర్ మండలంలో ఎల్లారెడ్డి ఆర్.డి.ఓ మన్నె ప్రబాకర్ శనివారం ఓటర్ నమోదును పరిశీలించారు. తహశీల్దార్ ఆర్. హిమబిందును ఓటరు నమోదు, వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నవతెలంగాణ విలేకరికి పరామర్శ


విలేకరిని పరామర్శిస్తున్న ఏలేటి సంతోష్‌రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్
లింగం పేట్ గ్రామానికి చెందిన నవతెలంగాణ విలేకరి సాయికు మార్ అనారోగ్యానికి గురై చికిత్స పొందు తుండగా.. విషయం తెలుసుకున్న స్థానిక సంస్థల రాష్ట్ర ఫోరమ్ ఉపాధ్యక్షులు ఏలేటి సంతోష్‌రెడ్డి శనివారం ఆస్పత్రిలో ఆయనను పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యాధికారికి సూచించారు. వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని అధైర్య పడవద్దు అండగా ఉంటామని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ ఖదీర్ ఉన్నారు.

జీపీ భవన నిర్మాణ పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఏఈ కార్తీక్

నవతెలంగాణ-గాంధారి
గాంధారి మండలంలోని పోతాంగల్ ఖుర్దు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను ఏ ఈ కార్తీక్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యము నాబాయి బల్వంత్‌రావు, ఉప సర్పంచ్ అకిటి గంగారెడ్డి, వార్డు సభ్యులు చౌకి స్వామి, చిన్నదొడ్ల సురేష్ రావు, పుప్పాల రమేష్, ఆకిటి కాశిరెడ్డి, కారోబార్ సంతోష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

గణిత టాలెంట్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు ప్రశంసపత్రం అందజేత

నవతెలంగాణ-సదాశివనగర్
మండల స్థాయిలో జరిగిన గణిత స్థాయి టాలెంట్ పరీక్షలో అడ్లూర్ ఎల్లారెడ్డి జడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వరుసగా ఆంగ్ల మాధ్యమంలో మొదటి మూడు ర్యాంకులు సాధించారు. మొదటి స్థానంలో శ్రీవన్య, రెండవ స్థానంలో శివాని, మూడో స్థానంలో పూజ నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ప్రశంస పత్రాలతో సత్కరించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

ఐమాక్స్ లైట్స్ ప్రారంభం


లైట్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి
మండలంలోని మద్దికుంటలో శనివారం ఐమాక్స్ లైటును ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ ఒక లక్ష 50 వేల మండల పరిషత్ నిధులతో లైట్‌ను ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొమ్మిడి రాంరెడ్డి, ఎంపిటిసి రాజేందర్, వార్డ్ మెంబర్ సాయిరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు తోట లింగం, రాజాగౌడ్, పంచాయతీ కార్యదర్శి హరి లతా తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు పట్ల హర్షం



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
ఎల్లారెడ్డి నియోజకవర్గానికి పలు రకాల అభివృద్ధి పనులు చేయడానికి 10 కోట్ల రూపాయలు మంజూరు చేయించడంతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌తో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచడంలో మదన్మోహన్ తీసుకుంటున్న చొరవ చాలా సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి అన్ని రకాలుగా ముందుకు నడిపించేలా మదన్మోహన్ కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజ్‌దాసు, కో ఆప్షన్ సభ్యులు షాహిద్ భాషతో పాటు కాంగ్రెస్ నాయకులు ఫారుక్, లక్ష్మణ్, ఇమామ్, నరసింహ రెడ్డి, సురేందర్ గౌడ్, ఖలీముద్దీన్ తదితరులున్నారు.

నర్సరీలు పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
నాగిరెడ్డిపేట్ మండలంలోని గోలి లింగాల్, ధర్మారెడ్డి గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న నర్సరీలను శనివారం ఎంపీడీవో రఘు పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలలో పెంచబోయే మొక్కల వివరాలను పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు మహేష్. సత్యనారాయణ ఉన్నారు.

ఆరు అడుగుల దీపం వత్తి తయారీ


పత్తితో దీపం వత్తిని చేస్తున్న మహిళలు

నవతెలంగాణ-మద్నూర్
డోంగ్లి మండల కేంద్రంలోని రామాల యంలో ఐదు రోజులు దీపం వెలిగేటట్టు పత్తితో ఆరడుగుల దీపం వత్తిని ఆ గ్రామ మహిళలు తయారు చేశారు. ఆలయంలో దీపాన్ని శనివారం వెలిగించారు. ఈ దీపం ఐదు రోజులపాటు వెలిగే విధంగా వత్తిని తయారు చేసిన మహిళలను గ్రామస్తులు అభినందించారు.

క్రీడాకారునికి ఆర్థిక సహాయం


క్రీడాకారున్ని సన్మానిస్తున్న బి.బి.పాటిల్

నవతెలంగాణ-సదాశివనగర్
మండలంలోని వజ్జపల్లి తండాకు చెందిన మాలోత్ రాహుల్ జాతీయ స్థాయి అండర్-18 క్రికెట్‌కు ఎంపిక అయ్యారు. క్రీడాకారుడు నిరుపేద కుటుంబానికి చెందినవారని గిరిజన నాయకుడు విజయ్ తెలిపారు. విజయ్ క్రీడా కారున్ని జహీరాబాద్ ఎం.పి బి.బి.పాటిల్‌ని కల్పించినట్లు తెలిపారు. ఈసందర్భంగా బి.బి పాటిల్ క్రికెట్ క్రీడా కారున్ని సన్మానించారు. ఆయనకు 15000/- రూ ఆర్థిక సహాయం అందించారు. జాతీయ స్థాయి క్రికెట్‌లో రాణించాలని ఆకాంక్షించారు. ఆర్థిక సహాయం చేసిన సందర్భంగా కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొలి పల్లి మహేందర్ రెడ్డి, లింబాద్రి నాయక్ ,రాజు తదితరులు పాల్గొన్నారు.

అతివేగం, అజాగ్రత్తతో రోడ్డు ప్రమాదాలు

- **యువకులు రోడ్డుభద్రత నియమాలు పాటించాలి**
- **విద్యార్థులకు అవగాహన కల్పించిన ఆర్టీఏ విక్రమ్**


మాట్లాడుతున్న ఆర్టీఏ విక్రమ్

నవతెలంగాణ-లింగంపేట్
వాహనాలపై ప్రయాణిస్తున్న సమయంలో రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కామారెడ్డి ఆర్టిఏ విక్రం విద్యార్థులకు సూచించారు. శనివారం లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం సందర్భంగా రోడ్డు భద్రత నియమాలపై ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయని వివరించారు. అవగాహన లోపం కారణంగా జరిగిన ప్రమాదాల్లో విలువైన ప్రాణాలు పోతున్నాయనన్నారు. దీనివల్ల కుటుం బాలు పెద్దదిక్కు కోల్పోయి వీధిన పడుతున్నట్టు వెల్లడించారు. వాహనాలు పరిమిత వేగంలో నడపాలన్నారు. ప్రయాణాల సమయంలో హెల్మెట్ వినియోగించాలని సూచించారు. ప్రమాదాలు సంభవించిన సమయంలో హెల్మెట్ లేని కారణంగా తలకు బయలమైన గాయాలై ప్రాణాలు కోల్పోతున్నట్లు వివరించారు. యువత అతివేగంగా వాహనాలు నడిపి చిరుప్రాయంలోనే ప్రాణాలు పోగొట్టు కుంటున్నారని, చేతికంది వచ్చిన కుమారు లు చనిపోవడం వల్ల తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుతుందన్నారు. విద్యార్థులు యువకులు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. అలాగే వాహనాలు నడిపే వారు డ్రైవింగ్ లైసెన్స్ కొన్ని ఉండాలని వాహనాలకు భీమా చేయించుకోవాలని సూచించారు.

అనంతరం లింగంపేట ఏఎస్ఐ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దన్నారు. ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని జీవితంలో ఉద్యోగాలు సాధించి స్థిరపడాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఇటీవల కాలంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు కళాశాల విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల విషయాలు విద్యార్థుల దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు హుక్కా సేవిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఆ యంత్రాన్ని పాఠశాల ఉపాధ్యాయుల ద్వారా తమకు అందించాలని సూచించారు. హుక్కా సేవిస్తూ పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్‌లకు బదులుగా శరీరానికి వ్యాయామాన్ని ఇచ్చే క్రీడలు ఆడాలని సూచించారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది బంసి స్వామి గౌడ్, ఆమీర్ పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు, వహీద్ సిద్ధి, పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని సంఘాలు గ్రేడ్ 'ఏ'లో ఉండాలి

- **డీపీఎం సుధాకర్**


మాట్లాడుతున్న డీపీఎం సుధాకర్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
ప్రతి గ్రామంలో ఐకెపి ద్వారా నిర్వహిస్తున్న డ్వాక్రా సంఘాలు గ్రేడ్ 'ఏ' లో ఉండాలని జిల్లా డిపిఎం సుధాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల మండల సమైక్య కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల సంఘం సమావేశం నిర్ణీత తేదీ ప్రకారం ఏర్పాటు చేసుకొని అన్ని రకాల లావాదేవీలు జరిపి దానిని ఆన్‌లైన్‌లో పొందుపరచడం ద్వారా ఏ గ్రేడ్ లోకి తీసుకురావచ్చని తెలిపారు. ప్రతి సంఘం కచ్చితంగా సక్రమమైన వాయిదాలు రుణ చెల్లింపులు చేసి కొత్త రుణాలు తీసుకోవడం ద్వారా ఆస్తులు పెంచుకొని వివిధ వ్యాపార మార్గాల ద్వారా స్వయం ఉపాధిలో రాణించాలని సూచించారు. అదేవిధంగా పెరటి కోళ్ల పెంపకం, గేదెల పెంపకం, సోలార్ ప్లాట్ల ఏర్పాటు తదితర అంశాలపై వీవోఏలకు అవగాహన కల్పించారు. సక్రమంగా పనిచేయని విఓఏల పై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు శాంత, ఏపిఎం జగదీష్, డిఎంజి సంగమేశ్వర్, సీసీలు దత్తు, నారాయణ, రమేష్, రషీద్, సాయిలు, సుజాత, అకౌంటెంట్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)
ఎల్లారెడ్డిలో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల(ఇంగ్లీష్ మీడియం)లో 2024 -25 విద్యా సంవత్సరానికి గాను ఆన్లైన్లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023- 24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, 5వ తరగతిలో 40 సీట్లకు గాను 30 సీట్లు మైనారిటీలకు 10 సీట్లు రిజర్వేషన్ ప్రకారం నాన్-మైనారిటీలకు కేటాయించనున్నట్టు పేర్కొన్నారు. 6, 7,8, 9 తరగతుల్లోనూ పరిమిత సంఖ్యలో ఖాళీ సీట్లు ఉన్నాయని , వాటికి కేవలం ముస్లిం మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 18న అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, ఫిబ్రవరి 6 దరఖాస్తులకు తుది గడువు అని సూచించారు. పాఠశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థికి ఉచిత పాఠ్య, రాత పుస్తకాలు, యూనిఫాం స్పోర్ట్స్ డ్రెస్, డైలీ యూజ్ కిట్, పడక దుస్తులు, ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన బోధన , పోషక విలువలతో కూడిన ఉచిత భోజన వసతి ఉన్నట్టు తెలిపారు. ముస్లిం విద్యార్థులకు ఉర్దూ, అరబ్బీ ప్రత్యేక తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థుల దుస్తులు ఉతకడానికి ధోబి సౌకర్యం సైతం ఉందని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులతో తల్లిదండ్రులు దరఖాస్తు చేయించాలని, వివరాలకు 99087 20671, 9705346569 నంబర్లకు గాని, పాఠశాలలో గాని సంప్రదించాలని కోరారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



నవతెలంగాణ-కామారెడ్డి
కామారెడ్డి బస్టాండ్ ఏరియాలో తెలియని మృతదేహం లభ్యమైనట్టు కామారెడ్డి పట్టణ ఎస్ హెచ్ ఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మగ వ్యక్తి వయసు సుమారు 40-50 సం.లు గల వ్యక్తి గత కొన్ని రోజులుగా బస్టాండ్ లోనే ఉంటూ, అక్కడే బస్టాండ్ ఆవరణలో ఫుట్ పాత్ పై చనిపోయి ఉన్నాడనీ ఇట్టి వ్యక్తి గురించి తెలిసిన వారు ఎవరైనా పోలీస్ స్టేషన్ కామారెడ్డి టౌన్ నందు సంప్రదించగలనీ తెలిపారు. మృతుడు నీలం రంగు జీన్స్ ప్యాంటు, బ్లాక్ అండ్ బ్రౌన్ రంగు చెక్స్ షర్టు ధరించి ఉన్నాడన్నారు. ఎవరైనా గుర్తుపడితే 8712686145 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

యువతి అదృశ్యం



నవతెలంగాణ-కామారెడ్డి
యువతి అదృశ్యమైన ఘటన కామారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. కామారెడ్డిలోని గోసంగికాలనికి చెందిన అంద్రాసి అనిత(19) ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్ళిపోయింది. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల, స్నేహితుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు శనివారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఆమె ఫోన్ స్విచాఫ్ అయి ఉంది. ఈమె ఆచూకీ ఎవరికైన తెలిసినచో కామారెడ్డి పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

బ్రిలియంట్ స్కూల్‌లో రామాయణ గాథ


వేషాధారణలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ
నగరంలోని నాందేవ్‌వాడలోని బ్రిలియట్ గ్రామర్ హై స్కూల్‌లో శనివారం రామాయణ గాథ ఆలపించారు. విద్యార్థులు నాటకం రూపంలో రామయణ గాథ లవకుశల ద్వారా వివరించినట్టు ప్రధానోపాధ్యాయులు కేసరి రాజేంద్రప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు రామయన చరిత్రను చక్కగా నాటక రూపంలో తెలియజేసినట్టు తెలిపారు. సోమవారం ఆయోధ్యలోని రామ మందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ట నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


చోరీ జరిగిన ఇల్లును పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కామారెడ్డి
తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరికి పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి ఈ ఘటన చేసుకున్నట్టు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణంలో గల ఆర్యనగర్ కాలనీలో నివాసముండే తన్నీరు శేఖర్ ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో కలిసి తిరుపతి వెళ్లారు. శుక్రవారం రాత్రి వచ్చి చూడగా.. చోరీ జరిగిన ఆనవాళ్ళ కనిపించాయి. గుర్తు తెలియని దుండగులు తన్నీరు శేఖర్ అనే వ్యక్తి ఇంటిలోకి రాత్రిపూట దొంగతనంగా ప్రవేశించి ఇంటిలో ఉన్న మూడు లక్షల 50 వేల రూపాయల నగదు, మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, రెండు కిలోల వెండి వస్తువులను, రెండు లాప్టాప్ లను దొంగలించుకుని వెళ్లినట్లు ఆయన తెలిపారు. శేఖర్ అల్లుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వీక్లీ పరేడ్

నవతెలంగాణ-బాల్కొండ

మండల పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వీక్లీ పరేడ్‌ను నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి శనివారం వీక్లీ పరేడ్‌ను నిర్వహిస్తున్నామని ఆర్మూర్ రూరల్ సిఐ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ పరేడ్‌లో ఉమ్మడి మండలాల ఎస్సైలు భాస్కరాచారి, కె.గోపి, శ్రీనివాస్ యాదవ్, ఉమ్మడి మండల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వీక్లీ పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

నవతెలంగాణ

నిజామాబాద్

4

ఆదివారం | జనవరి 21, 2024 | www.navatelangana.com

లిల్లీపుట్ పాఠశాలలో అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవాలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో అయోధ్య రామ మందిరం ప్రారంభ ఉత్సవాలు శనివారం పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రాముడు సీత హనుమంతుడి వేషాధారణలో కనిపించారు. పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ.. అయోధ్య రామ మందిరం ప్రారంభ ఉత్సవాలు, దాని విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



వేషాధారణలో విద్యార్థులు

బాధిత కుటుంబాలను పరామర్శించిన ముత్యాల సునీల్ కుమార్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

నవతెలంగాణ-బాల్కొండ

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌కుమార్, బాల్కొండలో శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. జర్నలిస్ట్ మాలెం సాగర్ తండ్రి గత పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో సాగర్ కుటుంబాన్ని పరామర్శించారు. గత పది రోజుల క్రితం బండి మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుమారుడు బండి మల్లేష్‌ను వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బ్రహ్మారౌతూ రాజేందర్ సతీమణికి ఇటీవలే గుండెకు సంబంధించిన ఆపరేషన్ జరగడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఇరువురి కుటుంబాలను పరామర్శించి వారి కుటుంబాలకు మనోధైర్యాన్ని కల్పించారు. ఆయన వెంట బాల్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గున్నాల వెంకటేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు గోపు ఊషన్న, మొహమ్మద్ యునుస్, కుందారం శ్రీనివాస్, కట్టెల శ్రీనివాస్‌గౌడ్, వివేక్ విక్కీ, జక్క పద్మారావు, మహమ్మద్ అన్వర్, ఇమ్రాన్ ఖాన్, గోపు మహేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పాడ్, ఎడపల్లి తదితర గ్రామాలలో బూత్ లెవెల్ స్థాయి (బిఎల్వోలు) అధికారులు, ఓటర్ నమోదు క్యాంపెయిన్‌ను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఎడపల్లి తహసీల్దార్ మోతిసింగ్ సూచన మేరకు మండలంలోని బూతు లెవెల్ స్థాయి అధికారులు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు నుండి ఓటర్ నమోదు దరఖాస్తులను స్వీకరించారు. తహసీల్దార్ మోతిసింగ్ ఓటర్ నమోదు ప్రత్యేక క్యాంపెయిన్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి బిఎల్వోల పనితీరును పరిశీలించారు. వారికి పలు సలహాలు సూచనలను ఆయన అందజేశారు.

డ్యూయల్ డెస్కుల కోసం పాఠశాలకు రూ.50వేల విరాళం



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన కోల నితిన్ తన తండ్రి దివంగత కోల జనార్ధన్ స్మారకార్థం రూ. 50వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో పిల్లలకు డ్యూయల్ డెస్కుల నిమిత్తం రూ.50వేల విరాళం మొత్తాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.గంగాధర్‌కు అందజేశారు. పాఠశాలకు ఆర్థికసాయం అందించిన కోల నితీన్ కుటుంబ సభ్యులందరికీ పాఠశాల తరఫున ప్రధానోపాధ్యాయులు కె.గంగాధర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన లక్మా సంతోష్ రూ.5వేలు, నెళ్ళ శ్రీనివాస్ రూ.5వేలు, పల్లె కిషన్ రూ.2500 ఆర్థిక సహాయాన్ని పాఠశాల అభివృద్ధి కోసం అందజేశారు. గ్రామానికి చెందిన వ్యక్తులు పాఠశాల అభివృద్ధి కోసం నిధులు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వీరందరికీ పాఠశాల విద్యా కమిటీ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ నీరడి సాయన్న, మారంపల్లి అశోక్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బైకాని మహేష్, సీనియర్ ఉపాధ్యాయులు వంగరి మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు మిట్టపల్లి క్రీడాకారిణి ఎంపిక



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈ నెల 16 నుంచి 18 వరకు ఆర్మూర్‌లో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అండర్ 14 బాలబాలికల పోటీలలో జిల్లా బాలుర జట్టులో పురం మనితేజ పాల్గొని కాంస్య పతకం అందుకున్నాడు. బాలికల విభాగంలో మెండే శ్రీతిక పాల్గొని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి బంగారు పతకం అందుకొని ఫిబ్రవరి 3 నుంచి 6 వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం కబీర్‌దాంలో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశీల్ కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో రాష్ట్రజట్టును ప్రథమస్థానంలో నిలపడానికి కృషి చేయాలన్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశీల్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు మర్కంటి గంగామోహన్, ఉపాధ్యాయ బృందం రాజశేఖర్, రాఘవేందర్, బాల్‌రాజ్, పోశెట్టి, నిరంజన్, శ్రీధరాచార్యులు అభినందించారు.

టీయూ తెలుగు విభాగాధిపతిగా డాక్టర్ సిహెచ్ లక్ష్మణ్ చక్రవర్తి



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ బి.వెంకటేశం ఆదేశాలనుసారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి తెలుగు విభాగాధిపతిగా డా.సిహెచ్.లక్ష్మణ్ చక్రవర్తిని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు అందజేశారు. డాక్టర్.సిహెచ్.లక్ష్మణ్ చక్రవర్తి విభాగాధిపతిగా నియమించినందుకు వైస్ ఛాన్సలర్ బి.వెంకటేశం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యం.యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకం పట్ల తెలుగు శాఖ అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని నిరుపేదలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలను గుర్తించి వారికి ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశంతో చలికాలం సందర్భంగా దుప్పట్లను పంపిణీ చేసినట్టు అధ్యక్షులు మనోహర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ సంజీవ్, మోహన్, జక్కుం నాగరాజు, తీగల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీ ధర్మపురి అరవింద్

నవతెలంగాణ-బోధన్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ అన్నారు. శనివారం బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలని, అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరాలన్న ఉద్దేశంతో గ్రామగ్రామాన వికసిత భారత సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నేతలు వికసిత భారత సంకల్ప యాత్రను రాజకీయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆశీర్వదించాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్యే షకీల్ తన తీరును మార్చుకోవాలని హెచ్చరించారు. తన కొడుకు రోడ్డు ప్రమాదానికి కారకుడు అయితే తప్పించేందుకు ప్రయత్నించడం చాలా బాధాకరమని అన్నారు. బోధన్ నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎంపీ అయిన నాటి నుంచి కృషి చేస్తూనే ఉన్నానని తెలిపారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి వివరించి సమస్యల పరిష్కారానికి తాను కూడా కృషి చేస్తానని అన్నారు. తన ఎంపీ నిధుల నుండి అనేకసార్లు సుదర్శన్‌రెడ్డి విన్నపం మేరకు నిధులు కేటాయించానని తెలిపారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసేందుకు తమ పార్టీ ఎన్నడూ ముందు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డి మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మేక సంతోష్, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, బోధన్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, మండలాల అధ్యక్షులు మనోహర్, ఇంద్రకరణ్, కొలిపాక బాలరాజ్, బిజెపి సీనియర్ నాయకులు, ప్రధాన కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, బూత్ అధ్యక్షులు, వివిధ మోర్చాలా అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

ప్రజలపత్రిక.. నవతెలంగాణ

- ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి నసీమా సుల్తానా
- నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రజల పత్రిక నవతెలంగాణ అని ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి నసిమా సుల్తానా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, పోలీస్‌శాఖ నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన న్యాయచైతన్య సదస్సుకు హాజరైన ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి నర్సింహ సుల్తానా, అడిషనల్ డీసీపీ జయరాం, ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్, నిజామాబాద్ ఏసిపి విజయసారథి నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు, సర్పంచ్ చంద్రకళ బాలకిషన్, తహసీల్దార్ కలీం, ఇన్చార్జి ఎంపీడీవో బ్రహ్మానందం, జక్రాన్‌పల్లి ఎంపీటీసీలు రూపాల గంగారెడ్డి, తలారి మరియా సతీష్, మండల కోఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్‌ఖాన్, ఇన్చార్జి ఎంఈఓ శ్రీనివాస్, ఉమ్మడి నిజామాబాద్ సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గొర్త రాజేందర్, ఎస్సై తిరుపతి, పోలీస్ సిబ్బంది, అన్ని గ్రామాల నుంచి వచ్చిన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పలువురు

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ముప్కాల్ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నవతెలంగా-ముప్కాల్

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ముప్కాల్ విద్యార్థుల ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం శనివారం ఒక తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నమోదు చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం వివిధ పాఠశాలల నుంచి 250 ప్రాజెక్టులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా ముప్కాల్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ 'మల్టీ స్కానింగ్ రోబోట్' అనే అంశంపై రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులు ప్రశాంత్, ప్రణవ్, చైతన్య, అభినవ్‌కుమార్ ఈ వైజ్ఞానిక ప్రదర్శన రూపొందించిన వారిలో ఉన్నారన్నారు. విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో గైడ్‌లెన్స్ ఇచ్చిన ఫిజిక్స్ ఉపాధ్యాయులు కనకాద్రికి సైతం ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.గంగారాం, ఉపాధ్యాయులు జి.నరేందర్, సురేష్‌కుమార్, నరేష్, బాల గంగాధర్, సునీత కుమారి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్‌లోని బీఈడీ కళాశాల విద్యార్థులకు

మెయిన్ క్యాంపస్‌లో హాస్టల్ వసతి కల్పించాలి

- ఎన్ఎస్‌యుఐ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సారంగాపూర్‌లోని బీఈడీ కళాశాల విద్యార్థులకు మెయిన్ క్యాంపస్‌లో హాస్టల్ వసతి కల్పించాలని కోరుతూ యూనివర్సిటీ పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరిని ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో సారంగాపూర్‌లోని బీఈడీ కళాశాల విద్యార్థులకు మెయిన్ క్యాంపస్‌లో హాస్టల్ వసతి కల్పించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఎన్ఎస్‌యుఐ కార్యదర్శి బానోత్ సాగర్ నాయక్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో గత 4ఏండ్లుగా సారంగాపూర్‌లోని బీఈడీ కళాశాల విద్యార్థులకు మెయిన్ క్యాంపస్‌లోనే హాస్టల్ వసతి కల్పిస్తున్నారని, ప్రతి సంవత్సరం కల్పించిన విధంగానే ఈ సంవత్సరం కూడా ఆ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని సూచించారు. యూనివర్సిటీలో చదివే విద్యార్థులు వివిధ జిల్లాల నుంచి వస్తారని, సెమిస్టర్ ఎగ్జామ్స్ సమయంలో కానీ, ఇంటర్నల్స్ రాసే సందర్భంలో కానీ నానా ఇబ్బందులు పడతారని, యూనివర్సిటీ అధికారులు స్పందించి మెయిన్ క్యాంపస్‌లోని హాస్టల్ వసతి కల్పిస్తే యూనివర్సిటీకే మంచి పేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి అల్లూర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

మొదలైన 'స్పెషల్ కంపెనింగ్ డే



వవవవవ

నవతెలంగాణ-ముప్కాల్

బూత్ లెవల్ అధికారులతో రెండు రోజుల పాటు కొనసాగే ఓటర్ల జాబితా 'స్పెషల్ కంపెనింగ్ డే' మొదలైందని ముప్కాల్ డిప్యూటీ తహసీల్దార్ పి.శ్రీకాంత్ శనివారం తెలిపారు. బూత్ లెవల్‌లో విధులు నిర్వర్తించే అధికారులు తమ తమ బూత్ లెవల్‌లో ఉదయం 10గంటల నుంచి అందుబాటులో ఉన్నారన్నారు. అదేవిధంగా జనవరి 1వ తేదీ 2024 వరకు 18 సంవత్సరాలు నిండి ఉండి ఓటుహక్కు లేని వారు ఫారం నంబరు-6 ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఓటరు కార్డులో ఏమైనా తప్పుల సవరణ ఉంటే ఫారం నంబరు-8 ద్వారా సవరించుకోవచ్చని వెల్లడించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే బూత్ లెవల్ అధికారిలను సంప్రదించాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు రవీందర్‌గౌడ్, నాగయ్య, అమీనా బేగం, జ్యోతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను సంరక్షించాలి.. చదివించాలి..

- భేటీ బచావో.. భేటీ పడావ్‌లో సర్పంచ్



నవతెలంగాణ-ఆర్మూర్

ఆడపిల్లలను చదివించాలి.. సంరక్షించాలని సర్పంచ్ ఇందూర్ సాయన్న, అంగన్వాడి సూపర్వైజర్ వెంకట రమణమ్మ అన్నారు. భేటీ బచావో, బేటి పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చేపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. భ్రూణ హత్యలు చేయవద్దని, ఆడపిల్లలు మనో ధైర్యంగా ఉండాలని, ప్రతి ఆడపిల్లకు సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్, సెక్రటరీ హరీష్‌రెడ్డి, ఏఎన్ఎం సువర్ణ, అంగన్వాడీ టీచర్లు, ఐకెపి సీఏలు వనిత, అమల, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆల్‌ఫోర్స్ జూనియర్ కళాశాలకు అనుమతి లేదు



వినతిపత్రం అందజేత

- జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ పట్టణంలోని ఆల్‌ఫోర్స్ జూనియర్ కళాశాలకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఇంతవరకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీ రఘురాజ్ స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లాలోని పలు విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేసిన మేరకు జిల్లా ఇంటర్ విద్య శాఖ విచారణ చేస్తుందని ఈ మేరకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుండి, జిల్లా ఇంటర్ విద్య శాఖ నుండి ఎలాంటి అనుమతి ఆల్ ఫోర్స్ జూనియర్ కళాశాలకు లేదని స్పష్టం చేశారు. ఎస్.ఎఫ్.ఐ. జిల్లా కార్యదర్శి బోడ అనిల్, ఏ.ఐ.ఎస్.ఎఫ్. జిల్లా కార్యదర్శి రఘురాం నాయక్, గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు జైత్ రామ్ రాథోడ్, టీ.వీ.యు.వి.రాష్ట్ర సంఘం వర్కింగ్ అధ్యక్షులు లాల్ సింగ్, పీ.డి.ఎస్.యు. జిల్లా కార్యదర్శి గణేష్, టీ.ఎస్.ఎఫ్. జిల్లా జిల్లా అధ్యక్షులు వి.మహేష్‌రెడ్డి, ఏ.ఐ.ఎస్.ఎఫ్. జిల్లా అధ్యక్షులు అంజలి, ఏ.ఐ.పీ.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాలా, తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్ రామ్ ఫిర్యాదు మేరకు తాము విచారణ చేస్తున్నామని తెలియజేశారు.

యూనివర్సిటీ క్రాస్ కంట్రీ (10కి.మి) జట్ల ఎంపికలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అంతర కళాశాలల పురుషులు, మహిళల క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్ 2024ను వర్సిటీ క్రీడామైదానంలో నిర్వహించినట్టు డైరెక్టర్ డాక్టర్ జి.బాలకిషన్ శనివారం తెలిపారు. ఈ ఛాంపియన్‌షిప్‌కు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి వివిధ డిగ్రీ కళాశాలల అథ్లెట్స్ సుమారు 40 మంది పాల్గొన్నారు. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్ 2024 మహారాష్ట్రలోని నాందేడ్ శ్రీ రామానంద తీర్థ మరట్వాడ యూనివర్సిటీలో ఫిబ్రవరి 10, 11 తేదీలలో నిర్వహిస్తారని, ఇందులో మొదటి ఆరుస్థానాల అథ్లెట్స్ తెలంగాణ వర్సిటీ తరుపున పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీలో ఛాంపియన్‌షిప్ ఎంపిక నిర్వహించడానికి అనుమతి ఇచ్చి క్రీడలను ప్రోత్సహిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరికి డైరెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపికైన అథ్లెట్స్..

పురుషుల విభాగంలో కె.అనిల్ (టిటిడిలో అర్‌డిసి కామారెడ్డి), డి.జ్ఞానేశ్వర్ (జిజిసి), జె.బంధునాయక్ (జిజిసి), కె.నాగరాజు (టిటిడిలో అర్‌డిసి కామారెడ్డి), ఎస్.వెంకుల్ (జిజిసి), కె.వినోద్ (జిజిసి) మహిళల విభాగంలో బి.హరిత (జి.డి.సి కామారెడ్డి), ఎం.అకిత (జిడిసి కామారెడ్డి), జి.మౌనిక జిజిసి, జి.రోజా టిఎస్ డ్లు అర్‌డిసి నిజామాబాద్, జె.శ్రీవర్ష జిజిసి, ఎస్.దీక్ష టిఎస్ డ్లు అర్‌డిసి నిజామాబాద్ ఉన్నారు. ఈ ఛాంపియన్‌షిప్ కార్యనిర్వాహకులుగా డా.బి.ఆర్.నేత కన్వీనర్‌గా డా.జి.బాలకిషన్ వ్యవహరించగా, వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్స్ బాలమణి, అనిల్, ప్రవీణ్, రాజేందర్, జూనియర్ అసిస్టెంట్ నరేష్, మల్లికార్జున్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



బాల్యవివాహాలపై అవగాహన

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం శనివారం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక అధ్యాపక బృందంతో సమావేశం ఏర్పాటు చేసినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.వినోద తెలిపారు. సమావేశంలో పాఠశాలకు సంబంధించిన ఎస్ఎంసీ ఎలక్షన్స్, బాల్య వివాహాల గురించి పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్.వినోద, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆర్.వినోద

పౌష్టికాహారం లోపం లేకుండా చూడాలి

నవతెలంగాణ-భిక్కనూర్

చిన్నారులకు పౌష్టికాహారం లోపం లేకుండా చూడాలని రాష్ట్రీయ బాలల స్వస్థ వైద్యుడు మనోజ్ చెప్పారు. శనివారం పట్టణంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రులకు బరువు తక్కువ ఉన్న పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. చిన్నారులు తల్లిదండ్రులు బలమైన పోషక పదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వసంత, ఆశా కార్యకర్త సంతోషి, చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గ్రామాల్లో బహిష్కరణ ఉండొద్దు

- మనుషుల పట్ల మానవత్వం కలిగి ఉండాలి
- ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి నర్సింహా సుల్తానా
- చట్టాలపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గ్రామాల్లో బహిష్కరణ అనేది ఉండొద్దని.. ప్రతి ఒక్కరూ మనుషుల పట్ల మానవత్వం కలిగి ఉండాలని ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి నర్సింహ సుల్తానా అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్లో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిజామాబాద్, పోలీస్ శాఖ నిజామాబాద్ ఆధ్వర్యంలో సంయుక్తంగా న్యాయ చైతన్య సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ.. ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తన గత 15 సంవత్సరాల అనుభవాన్ని ప్రజలకు తెలియజేస్తూ.. 'మా తాతల కాలం నుంచి అందరూ పోలీస్ శాఖలో పని చేశారు. మా తాత ఒక సందర్భంగా మాట్లాడుతూ.. పోలీసు అనుకుంటే పుట్టలో పామును బయటకు తీస్తాడని' తెలియజేశారు. చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోకూడదని అన్నారు. చట్టం దృష్టిలో ఆడ మగా ఇద్దరూ సమానమేనని వివరించారు. పట్టా భూములపై, ఇతర సమస్యలపైన పోలీస్ డిపార్ట్మెంట్, జ్యుడీషియల్ కోర్టు, రెవెన్యూ డిపార్ట్మెంట్‌ను సంప్రదించాలని ప్రజలకు తెలియజేశారు. గ్రామాలలో అంటరాని తనం ఉండకూడదని వివరించారు. ప్రజలు కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, బ్యాంకుల ద్వారా ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు జరిపేటప్పుడు మోసపోవద్దని సూచించారు. ఆన్లైన్లో ఎవరికి కూడా ఓటీపీ చెప్పకూడదని అన్నారు. చైన్ స్నాచింగ్ కేసులు, డ్రగ్స్ అండ్ ఫోక్సో చట్టంపైన అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీపీ జయరాం, ఏసీపీ విజయ సారథి, ఆర్డీవో వినోద్‌కుమార్, ఆర్మూర్ బార్ ప్రెసిడెంట్ చిన్నరెడ్డి, ఎంపీపీ కుంచాల విమల రాజు, తహసీల్దార్ ఖలీమ్, ఎస్సై తిరుపతి, సిఐ సైదులు, ఎంపీడీవో బ్రాహ్మనందం, మండల కో ఆప్షన్ సభ్యులు బుల్లెట్ అక్బర్‌ఖాన్, ఎంపీవో యూసఫ్‌ఖాన్, ఎంఈఓ శ్రీనివాస్, సర్పంచ్ జక్కం చంద్రకళ బాలకిషన్, గొర్త రాజేందర్, ఎంపీటీసీలు రూపాల గంగారెడ్డి, మరియా సతీష్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి

రేపటి నుంచి ఉర్సు ఉత్సవాలు

- బడాపహాడ్‌ను సందర్శించిన ఆర్డీవో



బడాపహాడ్ వద్ద ఆర్డీవో

నవతెలంగాణ-వర్ని

మండలంలోని బడాపహాడ్ పెద్దగుట్ట దర్గా వద్ద ఈ నెల 22 నుంచి మూడు రోజుల పాటు ఉర్సు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉర్సు ఉత్సవాలకు సంబంధించిన పనులను, ఏర్పాట్లను బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాలకు వచ్చే భక్తులకు వసతులు సౌకర్యాలు కల్పించాలని, ఎక్కడ కూడా లోటుపాట్లు ఉండకూడదని స్థానిక అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. అనంతరం డిప్యూటీ సూపరింటెండెంట్ జమాల్, అల్తాఫ్, వెంకట్‌గౌడ్ తదితరులు ఆర్డీవో రాజాగౌడ్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

ఆడపిల్లలు సమాజానికి మణిహారం

- మాజీ ఎంపీపీ హరిత



అవగాహన కల్పిస్తున్న మాజీ ఎంపీపీ హరిత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఆడపిల్లలు సమాజానికి మణిహారం లాంటి వాళ్లని.. ఆడపిల్లలకు రక్షణ కల్పిద్దామని మాజీ ఎంపీపీ హరిత అన్నారు. శనివారం మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో మహిళా శిశుసంక్షేమ ఆధ్వర్యంలో నేషనల్ గర్ల్స్ చైల్డ్ ప్రోగ్రాం బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆడపిల్లలు సమాజానికి మణిహారం లాంటి వాళ్ల అని.. ఆడపిల్లలకు రక్షణ కల్పిద్దామని వివరించారు. వారి బంగారు భవితకు పునాది వెయ్యాలని అన్నారు. వారికి స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని తెలియజేశారు. తరువాత మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ రాణి, అంగన్వాడీ టీచర్స్ నీలా, వనజ, ఆశావర్కర్స్ మహిళా సంఘం అధ్యక్షురాలు సునీత, లత తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్ష



విద్యార్థులకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించారు. మాథ్స్ టాలెంట్‌టెస్ట్‌లో మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు మీడియంలో కమ్మర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అఫ్సర్ ప్రథమ బహుమతి, గాయత్రి ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. ఇంగ్లీష్ మీడియంలో కమ్మర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎండి ఫైజన్, చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.తేజస్విని గెలుచుకున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మండల విద్యాధికారి ఆంధ్రయ్య చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గణితఫోరం మండలాధ్యక్షుడు కృష్ణకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపంతో బోధన్-సాలూర జాతీయ రహదారి పనులు

- ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్

నవతెలంగాణ-బోధన్

బోధన్ నుంచి సాలూర వరకు గత ఆరు నెలల నుంచి చేపడుతున్న జాతీయ రహదారి పనులు నాణ్యత లోపంతో చేపడుతున్నారని, అలాగే పనులు నత్తనడకన సాగుతున్నాయని ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ ఎన్.హెచ్ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. భూములు కోల్పోయిన రైతులు రహదారి పక్కన నాట్లు వేసుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని, పొలాల్లో వెళ్ళడానికి ఎక్కడా ర్యాంప్‌లు వేయకపోవడంతో, పంట పొలాలకు దిగడానికి ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. పొలాల్లో దమ్ము చేయడానికి ట్రాక్టర్‌లు పొలాల్లోకి వెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉందన్నారు. అలాగే పండిన పంటలు పొలాల్లో నుంచి తీసుకొని వెళ్లే పరిస్థితి లేదని వాపోయారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డు పనులలో మొరం, కంకర వేయడంతో దుమ్ముతో ప్రయాణికులు ఇబ్బందులు పడడమే కాకుండా, వేసిన పంటలపై దుమ్ము పడి పంటలు దెబ్బతింటున్నాయని అన్నారు. తక్షణమే రోడ్డుపై ట్యాంకర్‌లతో నీళ్ల పోయాలని కాంట్రాక్టర్‌లకు సంబంధించిన వ్యక్తులకు చెప్తే పట్టించుకోవడం లేదని తెలిపారు. తక్షణమే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కోరారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని బట్టాపూర్, తడపాకల్ గ్రామాల్లో గల 6,7,8 పోలింగ్ కేంద్రాలను శనివారం అడిషనల్ కలెక్టర్ చిత్రా మిశ్రా పరిశీలించారు. ఆమె వెంట ఎమ్మార్వో మహమ్మద్ యూసుఫ్, ఆర్ఐ.సదానందం ఉన్నారు.

గ్రూపు తగాదాలు ఉండొద్దు

- ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-బోధన్

గ్రామాలలో పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రూపు రాజకీయాలు, గ్రూపు తగాదాలు లేకుండా ఉండాలని, అందరూ కలిసిమెలిసి పనిచేసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరు సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన బోధన్ ఉమ్మడి మండలంలో హున్స, ఖాజాపూర్, సాలుర, జాడిజమాల్పూర్, సాలురాక్యాంప్, కల్దుర్కి, చిన్నమామంది, పెగాడపల్లి గ్రామాలలో పర్యటించి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను కార్యకర్తలు ఘనంగా ఆహ్వానం పలికి, పూలమాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే జూన్, జూలై మాసాలలో ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపి ఆర్థికంగా ఇబ్బందులు పడవద్దని అన్నారు. ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను, ఆరు గ్యారెంటీ పథకాలను విడతల వారీగా అమలు చేస్తామని, ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని అందరూ ధైర్యంగా ఉండాలని హామీనిచ్చారు. అనంతరం పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. సాలురా మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాహెర్‌బిన్ హందాన్, గడుగు గంగాధర్, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, పాషా, అల్లె రమేష్, హున్స సొసైటీ చైర్మన్ మందర్న రవి, మాజీ ఎంపీటీసీ చీల శంకర్, ఖాజాపూర్ అశోక్, సర్పంచ్ బుయ్యన్ చంద్రకళ, సురేష్‌పటేల్, రావుల లక్ష్మణ్, ఇల్తెపు రమేష్, సొక్కం రవి, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పలువురు

పలు గ్రామాలలో ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-కోటగిరి

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని యాద్గార్‌పూర్, ఎత్తొండ గ్రామాలలో ఆరోగ్య పరీక్షలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, ఎంపీఓ మారుతి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బందితో కలిసి గ్రామాలలో అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహించి, రక్తపోటు ఉన్నవారికి పరీక్షలు చేపట్టారు. అలాగే షుగర్ పరీక్షలు చేశారు. 30 సంవత్సరాలు పై బడినవారు ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని ఆరోగ్య విస్తరణ అధికారి సూచించారు. నిరంతరం యోగ, శారీరకంగా శ్రమ, వాకింగ్ చేయడం వలన వ్యాధులు అదుపులో ఉంటాయని తెలియజేశారు. కావున ప్రతి ఒక్కరూ మంచి పోషకాహారం తీసుకోవాలని తెలియజేశారు. పీఎంజేఏవై కార్యక్రమం నందు ప్రతి ఒక్కరూ అభ కార్డ్స్ తీసుకోవాలని, ఆయుష్మాన్ భారత్ కార్డ్స్ తీసుకోవాలని తెలియజేశారు.



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పర్యావరణ పరిరక్షణ

ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

- ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వినయ్ నాయక్

నవతెలంగాణ-సిరికొండ

విద్యార్థి దశ నుంచే మొక్కలు నాటి సంరక్షించాలని పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని వన క్షేమమే మన క్షేమమని, పుడమికి అందం వృక్షాలని సిరికొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ యం. వినయ్ నాయక్ అన్నారు. సత్యశోధక్ నేషనల్ గ్రీన్ కోర్ యూనిట్ ఆధ్వర్యంలో 'పర్యావరణం - పచ్చదనం అడవుల సంరక్షణ'పై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి సిరికొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ యం.వినయ్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వినయ్ నాయక్ మాట్లాడుతూ.. జీవకోటి మనుగడకు పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ప్రధానమని, అడవులను సహజవనరులను కాపాడి జీవావరణం, వాతవరణ సమతు ల్యతను పెంపొందించాలన్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే సహజ వనరులను కాపాడాలని పర్యావరణానికి హానికల్గించే కారకాలను నివారించాలని, వనరులను, వనాలను వృథా చేయకుండా విజ్ఞతతో, పరిమితంగా వాడాలన్నారు. విద్యార్థులు నేషనల్ గ్రీన్ కోర్ యూనిట్‌లో భాగస్వాములు కావడం అభినందనీయమని ప్రతి విద్యార్థి తమ జన్మదినాన్ని పురస్కరించుకొని విధిగా మొక్కను నాటి సంరక్షించాలని అన్నారు. సమాజంలో పరిణామాలకు విద్యార్థులే అసలైన మాధ్యమాలన్నారు. 'మొక్కల అవశ్యకత పర్యావరణ సంరక్షణ'పై యన్. జి. సి. ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ప్రాగంణంలో విద్యార్థులు, సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. వివిధ అంశాలలో ప్రత్యేక కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డి.ఆర్.ఒ.యస్. గంగారం, అటవీశాఖ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అడవుల సంరక్షణపై అవగాహన

పరిహారం పొందే విధానంపై న్యాయసలహా

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి. వైజయంతి ఆదేశాల మేరకు శనివారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మినర్సయ్య నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో బాధితులకు ప్రభుత్వం ద్వారా పరిహారం పొందే విధానంపై, సాక్షులను విచారించే విధానం, నేరస్తులకు ఖచ్చితంగా శిక్షపడటానికి సాక్షులను పొందుపరుచే విధానంపై డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య క్లుప్తంగా వివరించారు. ప్రతి పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన విధులను శ్రద్ధతో నిర్వహించి, నేరస్తులకు శిక్షపడేటట్లు కృషి చేయాలని కోరారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్, రాజారెడ్డి, బంటు వసంత్, కావేటి శేషు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఖాందేష్ శ్రీనివాస్, నిమ్మ దామోధర్ రెడ్డి, మహ్మద్ రహిముద్దిన్, డి.వీరయ్య, భూసారపు రాజేష్‌గౌడ్, అశోక్, శివరాం నాయక్, పొరిక రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పి.లక్ష్మీనర్సయ్య

మార్కెట్ కమిటీ గోదాముల పరిశీలన

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి మార్కెట్ కమిటీలో నిల్వ ఉంచిన ధాన్యం రైతుల వివరాలు తెలుపాలని మార్కెట్ కమిటీ సెక్రటరీని జిల్లా డీసీసీ డెలిగేట్, స్థానిక ఎంపీటీసీ కొట్టం మనోహర్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు షాహీద్ హుస్సేన్ శనివారం కోరారు. రైస్‌మిల్లు యాజమానుల ధాన్యం గోదాముల్లో నిల్వ ఉన్నాయన్న సమాచారం మేరకు శనివారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 36 మంది రైతులకు సంబంధించినవి ధాన్యం నిల్వ ఉన్నట్టు తెలిపారు. గోదాములో ఎలాంటి పత్రాలు లేకుండా 4వేల బస్తాలు ఉన్నాయని బట్టబయలైందని, గోదాముల్లో ఉన్న రైతుల ధాన్యంకు ఎలాంటి వివరాలు లేవని, ఇప్పటికైనా సంబధిత అధికారుల పనితీరు మార్చుకోవాలని మందలించారు. వెంటనే రైస్ మిల్లులు ధాన్యం ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. వారి వెంట కోటగిరి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు అయుబ్ ఉన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-బోధన్

ఎడపల్లి మండలంలోని ఏఆర్‌పీ క్యాంపు గ్రామంలో శనివారం ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సర్పంచ్ అలేఖ్య మహేష్‌గౌడ్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం 5లక్షల రూపాయలతో గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభించినట్టు తెలిపారు. తాము ఏ పార్టీలో ఉన్న గ్రామ అభివృద్ధి కోసమే పాటుపడతామని పేర్కొన్నారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభించడంతో మాదిగ దండోర సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్, మాదిగ దండోరా, దళిత సేవా సంఘం నాయకులు డప్పు పోచయ్య, జంగం ఎల్లయ్య, నాగేందర్, రాంకుమార్, ప్రశాంత్, గొర్రె స్వామి, వీర స్వామి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత కొన్ని రోజుల క్రితం ఇందల్‌వాయి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుమ్మరి రాజేష్ కుటుంబానికి గ్రామ యువతతో పాటు గల్ఫ్‌లో ఉన్న సోదరులందరు ఫోన్ పే, గ్రామంలో యువకులు ద్వారా వచ్చిన రూ.61,500లను శనివారం కుటుంబ సభ్యులకు అందజేసి మనోధైర్యంగా ఉండాలని భోరోసా కల్పించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి, ముదిరాజ్ నాయకులు లోకాని గంగారాం, లోకాని గోపి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదు కేంద్రాలు సందర్శించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్

ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణలో భాగంగా మెండోరా మండలంలోని సావెల్, కొడిచర్ల, వెల్గటూర్‌లోని ఓటరు నమోదు కేంద్రాలను అదనపు కలెక్టర్ చిత్ర మిశ్రా శనివారం సందర్శించారు. అదనపు కలెక్టర్ గ్రామాల ఓటరు నమోదు కేంద్రాలు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి ఓటర్ల నమోదు రిజిస్టర్లను పరిశీలించారు. ఓటరు నమోదు చేసేటప్పుడు తప్పులు లేకుండా చూడాలని సంబంధిత పత్రాలను పరిశీలించి ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. సంబంధిత శాఖ అధికారులకు పలు సూచనలు కల్పించారు. వారితో పాటు తహసీల్దార్, కార్యాలయ సిబ్బంది, గ్రామ సెక్రెటరీలున్నారు.

వరదకు సాగునీరు విడుదల

నవతెలంగాణ-నిజామాబాద్

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఇందిరమ్మ వరద కాలువకు సాగునీరు విడుదల చేసినట్టు ప్రాజెక్టు డిఈఈ గణేష్ తెలిపారు. యాసంగి పంటలకు సాగనీరు అందిస్తున్న క్రమంలో కాకతీయ కాలువ ద్వారా 3500, లక్ష్మి కాలువ ద్వారా 300, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల సాగు నీరు విడుదల చేస్తూ వరద కలువ ద్వార 5000 క్యూసెక్కుల సాగు నీరు అందిస్తున్నారు. గుత్ప ఎత్తిపోతలకు 270, అలీసాగర్ ఎత్తిపోతలకు 476 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ మిషన్ భగీరథ పథకం ద్వారా 152 క్యూసెక్కుల తాగునీరు అందిస్తున్నారు. ప్రాజెక్టు నుంచి 354 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతుండగా ప్రాజెక్టు నుంచి పూర్తిగా 1152 క్యూసెక్కుల నీరు బయటికి విడుదల అవుతున్నట్టు ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు.

రక్తదానం పట్ల అపోహలు వీడాలి

నవతెలంగాణ-కామారెడ్డి

రక్తదానం పట్ల అపోహలు వీడి, ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ రక్తదానం చేయొచ్చని ఐవిఎఫ్‌సేవా దళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు వైద్యశాలతో అనీమియా వ్యాధితో బాధపడుతున్న పేషెంట్‌కు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం కావడంతో రక్తదాత రఘువీర్‌రెడ్డి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రక్తదానం చేసినట్టు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ నేటి సమాజంలో చాలామందికి రక్తదానం పట్ల అపోహలు ఉన్నాయన, రక్తదానం వల్ల అనేకమైన అనారోగ్య సమస్యలు వస్తాయనే అపోహలు ఇప్పటికీ సమాజంలో నెలకొని ఉన్నాయని తెలిపారు.

